# ఆశాకిరణం

"తెల్లవారితే నరకచతుర్దశి. రేపు రాత్రి దీపావళి. కనకమ్మా! బాగా చీకటితో రావాలి నువ్వు. భోజనాలు ఆలస్యం అయితే పిల్లలు తట్టుకోలేరు పిల్లల సంగతలా వుంచు, మీ అయ్యగారుమాత్రం? పదిన్నర గంటలకల్లా, పండగ కానీ, మరేదేనాకానీ, భోజనం రెడీగా వుండాల్సిందే! లేకుంటే చిందులు తొక్కుతారు. అన్నట్లు జిలేబి, ఆవడలూ, పులిహోర, పాయసం, తొక్కుడు లడ్డూ చెయ్యాలనుకుంటున్నా.... పప్పులిప్పుడే నానబోసెయ్....చీకటితో వస్తే, నీకే పని సులువుగా వుంటుంది. ఏమంటావ్?" కంఠతా పట్టిన ఉపన్యాసం, ఏకబిగిని అప్పజెప్పినట్లు అప్పజెప్పి, పట్టుచీరె కొంగుతో ముఖం తుడుచుకుంది రాజేశ్వరి. గుక్క తిప్పుకోకుండా, అలా వరసగా పనులు పురమాయించాక. ఇక పనిమనుషుల ముఖాల్లో మారే ఎక్స్‌ప్రెషన్స్ తనకనిపించకుండా వుండటానికే ఆవిడలా, ముఖం తుడుచుకుంటుంది, పట్టని చెమటను, పట్టినట్లు నటిస్తూ!

వంటమనిషి కనకమ్మ తలాడించింది.

"మరి వెళ్ళిరా! బాగా చీకటితో....షుమారు నాలుగు గంటలకేనా రావాలి. తోడుగా కావలిస్తే, నీ పెద్ద పిల్లాణ్ణి తెచ్చుకో....నిన్నిక్కడ దిగబెట్టి వెళ్ళిపోతాడు." రాజేశ్వరి గిరుక్కున తిరిగి ఇంట్లోకి పెళ్ళిపోయింది. కనకమ్మ మెల్లిగా గేటువేపు నడిచింది, కనకమ్మ బయటకు వెళ్ళగానే, గేటుమూసి తాళం వెయ్యాలి కాబట్టి, "త్వరగా రావమ్మా కనకమ్మా!

రాత్రి పది దాటుతోంది గంట !'' అంటూ విసుగ్గా అరచిన గూర్ఖా, ఆవిడలా రెండో కాలు గేటు బయట పెట్టిందో లేదో, బుక్కున గేటు మూసి తాళం వేసేసాడు,

ఇంటివేపు అడుగులు వేస్తున్న కనకమ్మ మనసులో పెను తుఫానులు చెలరేగుతున్నాయి. గతమంతా గజిబిజిగా గుర్తుకు వస్తోంది.

రేపు దీపావళి....అందరూ ఎంతో సరదాగా గడుపుకొనే పండగ కానీ తనూ తన పిల్లలూ మాత్రం....ఎవరికి వారుగా లోలోపల కుమిలిపోతూ గడిపే ప్రత్యేకమైన రోజులు ఇలాటి పండుగలు....కారణం ?

భార్యనూ, నలుగురు బిడ్డల్నీ, నట్టేట్లో ముంచి, "మోక్షం, మోక్షం...." అంటూ సన్యాసుల్లో కలిసిపోయిన తన భర్త కాదూ? అతగాడుకి మోక్షం లభిస్తుందా ?

కానీ అనాటినుంచి తన బ్రతుకెంత దుర్భరంగా మారి పోయిందీ ?

"ఎంత విసిగించి చంపకుంటే, వాడలా దేశాలు పట్టి పోతాడు ?'' అంటూ, నింద తనమీదే వేసిన బావగార్లు, తోటి కోడళ్ళు, అత్తగారూ, మామగారూ, అన్నలూ, వదినెలూ, తననూ, తన పిల్లల్ని ఇకముందు ఎంచక్కా ఆదరిస్తారన్నది తెలుసుకుంది.

తన వాటాకు వచ్చిన చిన్న పెంకుటిల్లు....అదీ తన భర్తగారు చేసిన స్వాముల ఉపచారాల తాలూకు అప్పుల కోసం, తనే తెగనమ్మవలిసివచ్చింది.

ఇంక మిగిలిందేమిటి? తన నలుగురు బిడ్డలూ, భయంకరమైన భవిష్యత్తూ! దిక్కు తోచని ఆ అంధకారంలో తనకున్న దారి ఏమిటి? సెకండుఫారం వరకూ చదువుకున్న తను చేసే ఉద్యోగా లేమిటి?

అన్ని హంగులూ బాగున్నపుడే బంధువులేనా, తోబుట్టువులేనా!

ఏ కాస్త లోటువచ్చినా, ఆ బరువు తమమీదెక్కడ వచ్చిపడుతుందోనని భయపడి, తప్పుకు తిరిగేవారూ, తిరస్కారంగా చూసేవారూ, బంధువులే!

అన్నీ ఆలోచించుకున్న తనకు, మిగిలిం దీమార్గమేననిపించింది. ఓ ఆఫీసరుగారి యింట్లో వంట మనిషిగా కుదిరింది! ఏభై రూపాయలు జీతమిస్తామన్నారు.

"నీ పిల్లల్ని ఇటువేపు రానియ్యకూడదు. చాటుగా మాటుగా వస్తువులు చేరవేస్తున్నట్లు మాకు అనుమానం వచ్చిందంటే చాలు, నీ నౌకరికి నీళ్లొదులుకోవాల్సిందే! ఉదయం కాఫీల వేళకు ముందుగానే వచ్చి, అందరికీ కాఫీలు కలపడం దగ్గర్నుంచి నువ్వేచూచుకోవాలి.... ఇక్కడికి ఓ మైలు దూరమంటున్నావు మీ ఇల్లు! నీ యిష్టం. మధ్యాహ్నం భోజనాలయ్యాక వెళ్లొస్తామంటే మాకేం అభ్యంతరం లేదు. ఎటువచ్చీ, మీ అయ్యగారికి, నాకూ మధ్యాహ్నం మూడు గంటలకల్లా టిఫినూ, కాఫీ సిద్ధంగా వుండాలి. లేకుంటే ఆయనగారికి కోపం, నాకు నీరసమూ వచ్చేస్తాయి. ఇక పిల్లలు స్కూళ్ళనుండి వచ్చేసరికి టిఫిన్ రెడీగా, వేడిగా వుండాలి.

సరే రాత్రి భోజనం....అందరికీ భోజనాలయ్యాక, వంటయిల్లు శుభ్రపరచుకో, నీ యిష్టం. ఇంటికెళ్ళిపోవచ్చు. అన్నట్లు నాకు ఓపిక లేక ఆ పోపు సామాను డబ్బాలూ, కారం, పప్పుల డబ్బాలూ ఎక్కడివక్కడ పడున్నాయ్....ఎలాగూ రేపొద్దున్నుంచీ పనిలోకి వస్తావు కాబట్టి, అవో తీరులో సర్దుకో.... వంటిల్లు శుభ్రంగా లేకుంటే నాకు పరమ చిరాకు...."

అనర్గళంగా చెప్పి, ఆ క్షణమే ఆ వంటయిల్లనబడే మహారణ్యానికి, మకుటంలేని మహారాణి హోదా, తనకు ఉదారంగా కట్టబెట్టినట్లు చూసింది, ఆ ఆఫీసరుగారి భార్య జానకమ్మ!

కనకమ్మ మాట్లాడకుండా పనిలోకి వచ్చింది. ఉదయం ఆరుగంటలకు ప్రారంభమైన పని, ఓ తీరు, తెన్నూ లేకుండా సాగుతూనే వుంటుంది! ఆఫీసరుగారి భార్యకు ఆరుంబావుకల్లా స్ట్రాంగ్ కాఫీ కావాలి. లేకుంటే ఆవిడ కళ్లు తెరవలేదు. ఆఫీసరుగారికి ఏడుంబావుకి కాఫీ స్ట్రాంగ్‌గా వుండకూడదు, లైట్‌గా వుండకూడదు, మధ్యరకంగా వుండాలి. ఇక వారి పెద్దబ్బాయి ఎనిమిదికి నిద్రలేస్తే, రెండో అమ్మాయి తొమ్మిదయినా పళ్లు తోమదు. మూడోవాడు సరేసరి! ఓరోజు కాఫీ, మరోరోజు పాలు, ఇంకోరోజు ఓవల్టిన్ అంటూ, కలిపింది త్రాగక, త్రాగదల్చుకున్నదేదో చెప్పక, కప్పులూ, గ్లాసులూ గిరవాట్లు పెడతాడు! ఇక భోజనాల అంకం అంతులేకుండా సాగుతూనే వుంటుంది. ఉన్నది ఐదుగురు మనుష్యులైనా, మధ్యాహ్నం పదిన్నర మొదలు, రెండున్నర వరకూ డైనింగ్ టేబిల్ ఖాళీగా వుండదు. కనకమ్మ వడ్డించటం, కంచాలు తియ్యటం ఆగదు!

ఇంట్లో పరిస్థితి చూచిరావటానికి తీరికేది ? ఓ మైలు పోనూ, రానూ, శ్రైమేదీ ?

ఇంటి దగ్గర పెద్దవాడు గోపి బడికి వెళ్ళాలి. సీత ఉమ మెల్లిగా నీళ్లుతెచ్చి, అన్నం వండుతారు ! చిన్నవాడు రఘు, "అమ్మ ఎప్పుడొస్తుందక్కా ?" అంటూ అరగంటకోసారి అడుగుతూంటాడు.

భోజనానికూర్చున్న కనకమ్మకు ముద్ద మింగుడు పడదు. ఎదురుగా సాంబారు, కూరలు అన్నీ వుంటాయి కానీ ఆమె హృదయంలో వుండేది, చేతరాక, చేతులు కాల్చుకుంటూ, వండుకుతింటున్న పిల్లలు ! వాళ్ళ సత్తు కంచాల్లో పిసరంత పచ్చడి, చౌకరకం బియ్యపన్నం....

"ఇదేమిటమ్మా! మమ్మల్ని తలెత్తుకు బ్రతకనివ్వదల్చుకోలేదా నువ్వు ? ఫలానావారి బంధువు ఇంటింటా వంటలు చేసుక బ్రతుకుతోందంటే మాతలతీసి ఎక్కడ పారేసుకోవాలి! మా ఆడపిల్లల పెళ్ళిళ్ళెలా కావాలి ? మా మగపిల్లల పరువు ప్రతిష్ట లేం కావాలి ?"

నెలరోజులు తిరక్కుండా, దగ్గర బంధువులమని చెప్పుకొనేవారు, ఒకరొకరుగా వచ్చి అలా రాద్ధాంతం చేసారు. రావటానికి ఓపిక లేనివారు ఉత్తరాలు వ్రాశారు.

కనకమ్మ నవ్వి వూరుకుంది. వాళ్లు వెళ్ళాక వెర్రిగా విరగబడి నవ్వుకుంది !

తనేం దొంగతనం చేయటంలేదు. మరో కానిపని చెయ్యటం లేదు. తాము పట్టెడన్నం పెట్టలేరు ! తన బ్రతు

కేదో తను బ్రతుకుతుంటే చూచి ఓర్వలేరు! పైగా బంధువులమంటూ, పరువు ప్రతిష్ఠలంటూ వాపోవడం!

తన అదృష్టం బావుండివుంటే, తన భర్త, కర్తవ్య నిర్వహణలోనే మోక్షం వుందన్న ధర్మసూక్ష్మం తెలిసివున్నవాడై వున్నట్లయితే, తమకుండిన ఆస్తిలో పదోవంతు లేని ఈ బంధువులు - తను సరదాకోసం' ఇతరుల ఇళ్ళలో వంట పని చేసినా "భేష్" "భేష్" భేషజంలేని మనిషి కనకమ్మ అని పొగిడేవారు కాదూ ?

అయిందేదో అయింది! తన బిడ్డలను ఎలాగో బ్రతికించుకుంటుంది. చదివించుకుంటుంది! గోపి చదువుకున్నాడంటే, సీతకూ, ఉమకూకూడా నాలుగక్షరాలు చెప్పిస్తే,వాళ్ళే దర్జాగా బ్రతుకుతారు. తన బ్రతుకు హాయిగా వెళ్ళిపోతుంది తర్వాత. ఆ రోజే నిశ్చయించుకుంది కనకమ్మ.

అయితే, జానకమ్మగారికి అసమానూ జబ్బు, నీరసం. గదిలోంచి బయటకు అడుగు పెట్టకపోవటంతో, ఆ పిల్లలూ, వారి తండ్రి తనమీదే ఆధారపడేవారు అస్తమానూ! అదీ సహించింది! కానీ ఓరోజు చొరవతీసుకొని ఆయనగారు చెయ్యిపట్టుకున్నప్పుడు మాత్రం, చెంప పగలగొట్టక తప్పింది కాదు!

"ఇంకా నయం! యాగీ చేసావుకావు! శ్రీరామచంద్రుడి తర్వాత, మా ఆయనొక్కడే కలియుగంలో ఏకపత్నీవ్రతుడు. అట్టే పేలక, మరి పనిలోకి రాకు!" అంటూ మందలించి పంపేసింది జానకమ్మ. తనకివ్వాల్సిన కొరవ జీతం కూడా ఇవ్వకుండా!

ఆ రాత్రంతా కనకమ్మకు నిద్రపట్టలేదు. జీవితంలో దారిద్ర్యం ఒక్కటే సమస్య కాదు. శీల రక్షణకూడా సమస్యే! వంటమనిషి, ఇంటిమనిషిగా అన్ని బాధ్యతలూ అప్పజెప్పి, స్వంత మనిషిగా చేసుకోవటానికి ప్రయత్నించే మగవారిని ఎలా ఎదుర్కోవాలి ? మనుషులూ, ఇల్లూ మారుస్తుండవచ్చు; తన పనిలో, తన సమస్యలలో మార్పు ఏమొస్తుంది ? పది రోజుల తర్వాత, ఈ ఆఫీసరుగారింట్లో పని దొరికింది! పాపం! ఈ వెంకటాచలంగారు దేవుడిలాంటివారు. పిల్లలు ఏమంత గడుగ్గాయిలు కారు. ఆవిడ....రాజేశ్వరి....ఇల్లాలే....కానీ, మనుషుల్ని మరలుగా వాడుకోనే విద్యేదో ఆమె కుపుట్టుకతోనే సంప్రాప్తించిందిలా వుంది. పనిమనుషుల్ని కేవలం పురుగులుగా, దొంగలుగానే భావిస్తుంది. అనుమానం అదో హాబీ! పోపు డబ్బాలోని ఆవగింజలు మొదలు, గిన్నెల్లో మిగిలిపోయిన అన్నం మెతుకుల వరకూ రెండుపూటలా, తనువున్నపుడూ, ఇంటికి వెళ్ళాకకూడా, లెక్కపెడుతుంది. ఊపిరి తిరక్కుండా పురనులు రమాయించడంలో, చేయించుకోవడంలో ఆవిడకావిడే సాటి.

పనిమనుషులూ, వంటమనుషులూ, అందరూ దొంగలు కారనీ, వాళ్ళలో కొందరికి మాత్రమే అలాటి పాడుబుద్ధి వుంటుందనీ, ( ఆబుద్ధి కొందరు పెద్దమనుషుల్లో, ధనవంతుల్లో కూడా వుంటుందనీ) ఆమె చస్తే నమ్మదు.

అయితేనేం ? జీతం ఎక్కువగా ఇస్తున్నారు. నెలకు డెభ్భైరూపాయలు ! పాపం వెంకటాచలంగారు, గోపీని

హైస్కూల్లో చేర్పించి స్కాలర్ షిప్ ఇప్పించారు. ఇలాకొన్నేళ్ళు సాగిపోతే చాలు.

"ఏమిటి కనకమ్మా! ఇంత పొద్దుపోయింది ?"

పక్కింటి రమణమ్మ ప్రశ్నతో త్రుళ్ళిపడింది. ఆలో చనల గొలుసు తెగిపోయింది.

"ఇప్పుడే బాబుగారింట్లో అందరికీ భోజనాలయ్యాయి." సమాధానం చెప్పి తనుండే వాటాకేసి నడిచింది.

"పాపం! ఇప్పటివరకూ చూచి,చూచి నిద్రపోయా రంతా!" అంది రమణమ్మ నిట్టూరుస్తూ - గదిలో చాపమీద పడుకుని నిద్రపోతున్న పిల్లలకేసి చూస్తూ.

"నాలాటి దౌర్భాగ్యురాలికీ, నా పిల్లలకూ నిన్నొక రైను తోడు చూపించాడు దేవుడు." అంది కనకమ్మ కృతజ్ఞత నిండిన కళ్ళతో రమణమ్మవేపు చూస్తూ. రమణమ్మకూడా ఏకాకి. ఉదయాన్నే ఇంట్లో ఇడ్లీ, దోశె వగైరా చేసుక, ఆ చుట్టుప్రక్కల ఇళ్ళవారికి అమ్మి, జీవితం సాగిస్తోంది. సాయంత్రమంతా ఆమె ఖాళీగానే వుంటుంది. అంచేత కనకమ్మ పిల్లల్ని అవిడ చేరదీస్తుంది. పిల్లలమధ్య పడుకుని-పిల్లలందర్నీ ఆప్యాయంగా ఓమారు నిమిరింది కనకమ్మ. ఆ మాతృ హృద యంలో ఏ భావ సంచలనం రేగిందో భగవంతుడికే తెలుసు.

అర్ధరాత్రే లేచిన తల్లితోబాటు, పిల్లలూ లేచారు. గబగబా నలుగురికీ తలంటి, స్నానాలు చేయించాననిపించింది. అన్నమూ, పప్పూ కాస్తంత పాయసమూ కాచిపెట్టింది. ఆసరికే నాలుగుగంటలు దాటింది.

"హాయిగా ఆడుకుని, వేళకు అన్నాలు పెట్టుకుతినండి. ఇదో ఓ రూపాయుంది. టపాకాయలు కొనుక్కొని, సమానంగా పంచుక కాల్చండి, రాత్రికి నేనొచ్చేసరికి పొద్దుపోతుందేమో. జాగ్రత్త...." అంటూ బయల్దేరబోయింది.

"పండగరోజన్నా ఇంటిదగ్గర వుండమ్మా! నువ్వే అన్నం మాకు పెట్టమ్మా! ఈ ఒక్కరోజు...." పిల్లలు గోముగా అడిగారు !

కనకమ్మ హృదయం కెలికినట్లయ్యింది !

అవును ! అందరికీ పండగ శలవు. కానీ ఈరోజు తనకు శలవు కాదుకదా! మామూలుకంటే ఎక్కువ పనిచెయ్యాలి. పరాయి బిడ్డలకు తను కొసరి కొసరి తినిపిస్తుంది తన పిల్లలకు? తన చేత్తో ఆ పచ్చడి మెతుకులైనా తినిపించే అవకాశం లేదు!

ఆమె కళ్ళలో నీళ్ళు సుడులు తిరిగాయి.

"అలాగే మీరు పెద్దయ్యాక మనందరం పండగ చేసుకుందాం....మీ దగ్గరేవుండి, అన్నం, తినిపిస్తాను. ఈ రోజు వెళ్ళనివ్వండి నాయనా!"

తల్లి బాధను అర్థం చేసుకోగల ఊహ ఇప్పుడిప్పుడే వస్తున్న పిల్లలు, మరి మారాం చెయ్యలేదు.

ఆఫీసరుగారింట్లో అడుగు పెట్టడం వరకే తెలుసు. ఆ మరునిముషంలో కనకమ్మ మరగా మారిపోయింది.

మధ్యాహ్నం భోజనాలయ్యాక అలసటతో, అలా కూర్చుండి పోయింది కనకమ్మ.

"అన్నం తినేయ్ కనకమ్మా! పిండివంటలు స్టీలు డబ్బాలకు సర్దాలి!" అంది రాజేశ్వరి.

"నాకేమిటో కడుపులో నొప్పిగా వుందండీ! ఇప్పుడేమీ తినలేను!" ఏదో ఆలోచించుకుంటూ మెల్లిగా అంది కనకమ్మ.

"మరైతే ఆ లడ్డూలు, జిలేబి డబ్బాలలో సర్దెయ్! మరి కాస్సేపాగి, కడుపునొప్పి తగ్గాక భోజనం చేద్దూగాని!" అంది రాజేశ్వరి. "అరవై ఏడు" అంటూ మనసులో మరోసారి లడ్డూల సంఖ్య గట్టిగా గుర్తు పెట్టుకుంటూ.

వెంకటాచలం భార్యని గదిలోకి కేకేసాడు. తనొచ్చే లోగా కనకమ్మ యేం మింగుతుందో ననే భయంతోనే కదిలి వెళ్ళింది రాజేశ్వరి అయిష్టంగా.

"ఆవిడకు బిడ్డలున్నారు. ఇన్ని రకాలు మనం చేసుకున్నాం. తలకో నాలుగు రకాలుగా అన్నీ ఆవిడకు పొట్లాలు కట్టివ్వు రాజేశ్వరీ! బిడ్డలకు పెట్టుకుని తనూ తింటుంది!" అంటున్నాడు వెంకటాచలం.

రాజేశ్వరి ఎగిరిపడింది. "మంచివారే? అసలు మీ మగాళ్ళకేం తెలుస్తాయి ఇలాటి విషయాలు? ఇలా అలవాటు చేసామంటే, ప్రతి పండగకీ ఇలాగే ఇవ్వాల్సి వస్తుంది. ఈవిడ పనిచేసిన ఆఫీసరుగారు యేభై రూపాయిలే యిచ్చేవారుట! మనం డెభ్భై ఇస్తున్నాం. ఇంకా లేనిపోని అలవాట్లు మప్పకండి. ఆవిడకసలే కడుపునొప్పి అంటోంది. కావలసిన వరకూ ఇక్కడ తినమంటాను. కానీ ఛస్తే ఇంటికివ్వను. అసలు ఆడ పనుల్లో మీరు జోక్యం చేసుకోకండి."

"ఆవిడకు కడుపునొప్పిగా ఉందటనా ?" ఆశ్చర్యంగా అడిగాడు వెంకటాచలం.

"ఊ !"

వెంకటాచలం క్షణకాలం భార్యవేపు నిశితంగా చూశాడు. "ఎందుకో తెలుసా ?" అన్నాడు మెల్లిగా !

"ఇది మరీ బావుంది. కడుపునొప్పి ఎందుకు వస్తుంది ! అజీర్తివల్ల వస్తుంది." రాజేశ్వరి మాటలు మధ్యలో వుండగానే వెంకటాచలం అరిచాడు.

"కాదు రాజేశ్వరీ కాదు, అందరికీ అజీర్తివల్లే రాదు కడుపునొప్పి".నీలాటివారికి వస్తుంది అజీర్తివల్ల. ఇంటిదగ్గరున్న తన బిడ్డలు పచ్చడి మెతుకులు తింటూంటే, తను మరొకరి ఇంట్లో పంచభక్ష్య పరమాన్నాలతో భోజనం చేయవలసి వస్తే....ఆ తల్లి హృదయం ఎదుర్కొనే ఆవేదన తాలూకు "కడుపునొప్పి" నీలాటివారికి వెయ్యి జన్మలెత్తినా అర్థంకాదు రాజేశ్వరీ! నువ్విక్కడ ఆమెక్కావల్సినవన్నీ, ఎంత ఎక్కువగా తినమన్నా అవన్నీ ఆవిడకు విషంలా కనిపిస్తాయి. అవి తప్పని సరిగా తినవలసి వస్తే, కనకమ్మలాటి తల్లికి వచ్చేది కడుపునొప్పే!"

విస విసా వచ్చింది రాజేశ్వరి ఇవతలికి.

"చూశావా కనకమ్మా ! పండగపూటా నువ్వన్నం తినకపోవట మేమిటనీ, నేనేదో పెట్టటం లేదన్నట్లు కేకలేస్తున్నారు మీా అయ్యగారు" అంది కోపంగా ! అంత కోపం

లోనూ ఆమె కళ్ళు ఫలహారాల పళ్ళాలమీద పర్యవేక్షణ సాగిస్తూ, లెక్క వేస్తున్నాయి.

"అయ్యయ్యో ! అదేమిటండీ ? నాకే ఒంట్లో బాగులేదు ! పోనీండి. మీరంతా నొచ్చుకోవటం ఎందుకూ? కాస్త మజ్జిగన్నం తింటాను. మరే మనుకోకండి."

కాస్తంత మజ్జిగ అన్నం కలుపుకు తిన్నాననిపించి లేచింది కనకమ్మ. సాయంత్రంనుంచీ ఊరంతా మోగిపోతున్న టపా కాయలూ, వెలిగిపోతున్న దీపాలూ ఆమె మనస్సును మరింత మెలిదిప్పాయి; ఆరాత్రి పనంతా అయిపోయాక ఇంటికి వెళ్ళేముందు, రాజేశ్వరి ఓచిన్న టిఫిన్ బాక్సు కనకమ్మ చేతికిచ్చింది.

"మధ్యాహ్నం.... ఈ పూటకూడా నువ్వు చేసిన ఫలహారాలేం తినలేదు కనకమ్మా! నీకు ఒంట్లో బాగుండకపోయే మరి! పోన్లే ! టిఫిన్ డబ్బాలో నీకు సరిపడా పులిహోర, రెండు లడ్డూలు, రెండు జిలేబీలు వుంచాను. ఇంటికి తీసికెళ్లు. డబ్బా జాగ్రత్తగా రేపొద్దున పట్టుకురా !" అంది.

ఇంటికి వచ్చాక పిల్లలు నలుగురికీ, సమానంగా పంచింది కనకమ్మ. పక్కింటివారూ, ఆ మేడవారూ, ఈ డాబావారూ కాల్చిన టపాకాయల గురించి వర్ణించి వర్ణించి తల్లికి చెప్పి చెప్పి అలసిపోయి నిద్రపోయారు పిల్లలు.

నిద్రపోతున్న పిల్లలకేసి చాలాసేపు చూస్తూకూర్చుండి పోయింది కనకమ్మ. బయటంతా టపాకాయల మోత.... ఎక్కడచూచినా దీపతోరణాలు. కానీ ఆమె హృదయంలో

...సురుకున్న గాంధాధకారం....ఈ చీకటి ఎప్పుడు తొలుగు
...ంది ? తన జీవితంలోకి వెలుగు ఎప్పుడు వస్తుంది ?

"అమ్మా నాకు ఫస్టుమార్కు లొచ్చాయమ్మా!"
...పీ నిద్రలో పలవరించాడు.

ఒక చిన్న ఆశాకిరణం లేచి, అది ఇంతై, అంతై,
...జ్వల్యమానంగా ఆమె హృదయమంతా ఆవరించుకుని,
...ందాకా అలముకొనియున్న కారుచీకటిని పటాపంచలు చేసి
...సింది.

అవును. తను ఈనాడు కష్టపడుతోంది. పిల్లలూ కష్ట
...డుతున్నారు. కానీ మరికొన్ని రోజులు....నెలలు....సంవత్స
...లు తనిలాగే కష్టపడితే....గోపి చదువు పూర్తయి....
...ద్దవాడైతే....ఇక తనగ్గానీ, తన పిల్లలకు గానీ ఎలాటికష్టం
...వుండదు. ఇలాటి పండుగలు ఎన్ని వచ్చినా....ఎన్ని వెళ్ళినా...
...నూ, వాళ్లూ ఆనందంగా జరుపుకోగలరు. అందాకా ఓపిక
...ట్టాలి అంతే....

కనకమ్మ హృదయం ఆ మంచిరోజు "రేపో, ఎల్లుండో"
...న్నంత ఉత్సాహంతో వూగిసలాడిపోయిందా క్షణంలో....
ఆశాకిరణం ఆమెలో కొత్త జీవం పోయగా, పిల్లలమధ్య
...చ్చి పడుకుని, గాఢ సుషుప్తిలో మునిగిపోయింది.

("విశ్వరచన" నవంబరు 69)